# తగూ

మా యింటి దరిదాపుల్లో పచారీ దుకాణాలు తప్పించి కిళ్ళీ దుకాణాలు లేవు. నేను ఆఫీసుకు పోయేటప్పుడు వక్కపొడి పొట్లం కొనుక్కోవాలన్నా, సిగరెట్లు కొనుక్కోవాలన్నా జనం ఎక్కువగా వున్నా అక్కడికే వెళ్ళాలి. షాహుకారు క్షణం తీరికలేని ఆరాటంలో కనిపిస్తాడు ఎప్పుడూ.

ఆవాళ ఎప్పటిమాదిరిగానే దుకాణం ముందువున్న జనాన్ని ఒత్తిగించుకుని ముందుకు వెళ్ళి అర్ధణాకాసు తక్కెట్లో వేసి నిలబడ్డాను.

షాహుకారు ఇటు తిరిగి నా పక్కనే నిలబడివున్న స్త్రీని ఉద్దేశించి "డబ్బు ఇయ్యమ్మా" అన్నాడు ఆ అర్ధణా గళ్ళాపెట్టెలో వేసుకుంటూను.

"అదేందయ్యోయ్! ఇప్పుడే తక్కెట్లో వేస్తిని గదయ్యా గళ్ళాపెట్టెలో వేసుకుంటూనే డబ్బు అడుగుతావు" అంది ఆమె మీదపడి రక్కినట్టుగా.

"ఆ అర్ధణా నేను వేశాను" అన్నాను నేను కంగారు కప్పిపుచ్చుకుంటూనే.

"ఓయబ్బో! ఈయనేసిండంట నేను కదా యేస్తిని" అని ఆమె రెట్టించసాగింది.

ఆమెతో మాట్లాడటం నాకిష్టంలేదు, ఆమె బాగా

నోరుగల మనిషి. షాహుకారుతోనే "ఏమయ్యా ఏమంటావు?" అన్నాను.

షాహుకారు మా యిద్దరి ముఖాలలోకి అయోమయంగా చూసి తేరుకుని "డబ్బు చేతికియ్యాలిగాని తక్కెట్లో వేస్తే ఎలా చెప్పమ్మా, ఇదుగో ఇలాంటి చిక్కులే వస్తాయి" అంటూ విసుక్కున్నాడు. ఆ మందలింపు నాకూ వర్తిస్తుంది.

అతను నన్ను అనలేకపోవటానికీ ఆమెకీ నాకూ అతని దృష్టిలో వున్న విలువల్ని గురించి ఆలోచిస్తూంటే_

"ఏమయ్యోయ్ గొప్పింటి బిడ్డలాగున్నావ్. అబద్దాలాడొచ్చా? నేను కాదూ ఆ అర్ధణా వేసింది" అని ఆమె నావైపు తిరిగింది.

"నేను నీతో మాట్లాడటంలేదు అర్ధణా నువ్విచ్చావో లేదో నా కనవసరం. అతను గల్లాపెట్టెలో వేసుకున్న అర్ధణా మాత్రం నే నిచ్చిందే. ఈ మాట ఆయనతో చెబుతున్నాను. నీతో కాదు" అన్నాడు అలవాటులేని కాఠిన్యం తెచ్చిపెట్టుకుని.

షాహుకారు ఇతర పెద్దలు కొంతమంది ఆమెను వారించకపోలేదు. గౌరవంగానె మందలించారు. ఆమె మాటల్ని పట్టించుకోకండి అని ఒకరిద్దరు అనకపోలేదు. అయితే ఏ ఒక్కరూ ఆమెదే అబద్ధం అని అనలేక పోతున్నారు.

ఒ అర్ధణా కోసరం ఆమె అబద్దాలాడుతోందని నాకు తెలుసు. ఒక అర్ధణాకోసరం నేను అబద్దాలాడనని నమ్మటా

నికి ఆ చుట్టుపక్కల నా పలుకుబడి, నా విలువైన దుస్తులు, గౌరవాలు, పద్ధతులు, కొంతవరకు సహాకరించవచ్చు. అయితే ఆమె ఒకే ఒక ఆస్కారం చూసుకుని ఈ అబద్ధానికి తల పడింది. పదిమందీ తప్పు ఆమెదే అయివుంటుందని లోలోపల అనుకోవచ్చుగాక. కాని పైకి ఎలా అనగలరు? ఆ స్థాయికి సమాజంలో వ్యక్తి విలువ పెరిగిందాయె.

షాహుకారు ముఖం అదోమాదిరిగా పెట్టి "నిజా నిజాలు దేముడికే తెలియాలి" అంటూ గొణుక్కుంటూ సిగరెట్టు ఇవ్వబోయాడు.

నాకు కష్టం వేసిన మాట నిజం. షాహుకారు ధోరణి నాకు నచ్చలేదు.

"నీ ఉద్దేశ్యం ఆఅర్ధణా నే నివ్వలేదనేనా?" అన్నాను.

"ఆమాట నే నెలా అనగలనండీ" అన్నాడు షాహుకారు.

"అదేం మాట! అంటే నే నివ్వలేదనా" అంటూ ఆమె అరిచింది.

"అరవమాకు మా తల్లీ. నీకు దండం పెడతాను. నేను ఓ అర్ధణా కాసుని గళ్ళా పెట్టెలో వేసుకున్న మాట నిజం. అది నీదో ఆయనదో మటుకు నాకు తెలియదు." అన్నాడు షాహుకారు నిస్సహాయంగా.

ఒక అర్ధణా తెలియదని ఇంతసేపు కొనసాగించటం నాదే బుద్ధితక్కువగా తోచింది. ఒక అర్ధణాకోసరం నా నిజాయితీని నేను రుజువుపరుచుకొందుకు ప్రయత్నించటం, ఆమె అబద్ధం ఆడుతుందని రుజువు చెయ్యటం. ఇదంతా చాలా

చాలా స్వల్పమయిన విషయాన్ని అనవసరంగా పెద్దది చేసుకుని కాలయాపన చేసుకోవటంగా నాకు అనిపించి చట్టున జేబులోంచి మరొక అర్ధణాకాసు తీసి అతగాడికిస్తూ "అర్ధణా కోసరం అబద్ధం ఆడతానని ఎప్పుడు అనుకోకు." అని వాళ్ళని తప్పించుకుని రోడ్డుమీదకు వచ్చాను.

"నిజం తేలిపోలా, ఆ అర్ధణాకాసు అతనే ఇచ్చివుంటే మళ్ళీ ఇంకో అర్ధణా ఎందుకిస్తాడు దొంగ దొరికిపోయె" ఇది ఆమె గొంతు.

"హుమ్! తప్పకదమ్మా నోరు జారటం, కలిగినాయన ఆయనను డబ్బు కొదవా. ఏదో యిచ్చాననుకున్నాడు. ఏలాగూ జేబులోంచి తీసిన అర్ధణా జేబులోనే వేసుకుని వుంటాడు. గొప్పోరు బయటపడతారా చదువుకున్న బిడ్డ - లౌక్యంగా తప్పుకున్నాడు."

"అంతేలెండి. నేనూ అలాగే అనుకున్నా" అన్నాడు సాహుకారు.

"నా పొరపాటు నా కర్థం అయింది. ఎంతో అలౌక్యంగా ప్రవర్తించాను." అనుకుని వెనకనించి ఆ గయ్యాళి మనిషి నవ్వి కమ్చీలా నన్ను తరుముతుంటే, తలవంచుకుని చరచరా ముందుకు పోయాను."